24 DEC 2020

ANDHRA JYOTHI



విద్యుత్ వెలుగుల్లో యానాం రోమన్ కేథలిక్ చర్చి

## కో-ఆపరేటివ్ ప్రింటింగ్ ప్రెస్‌కు ఎన్నికలు

యానాం, డిసెంబరు 23: పుదుచ్చేరి కో-ఆపరేటివ్ రిజిస్ట్రార్ ఆదేశాల మేరకు సహకార చట్టం నిబంధనల మేరకు యానాం కో-ఆపరేటివ్ ప్రింటింగ్ ప్రెస్ లిమిటెడ్‌లోని ఏడు డైరెక్టర్ల పోస్టులకు ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసినట్టు సంస్థ పరిపాలనాధికారి ముమ్మిడి శంకర్ తెలిపారు. ఈ నెల 29న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ప్రకటన, 30న అభ్యంతరాల స్వీకరణ, నామినేషన్ల జారీ, జనవరి 2న పోలింగ్ నిర్వహిస్తారు.

# క్రిస్మస్‌కు చర్చిల ముస్తాబు

యానాం, డిసెంబరు 23: యానాంలోని చర్చిలు క్రిస్మస్ వేడుకలకు ముస్తాబయ్యాయి. చర్చిలను విద్యుత్ దీపాలతో ఆలంకరించారు. ఇప్పటికే పలువురు క్రైస్తవులు ఇళ్ల వద్ద క్రిస్మస్ స్టార్లు పెట్టుకున్నారు. పురాతన రోమన్ కేథలిక్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. ఈ చర్చికి యానాం పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు కులమతాలకు అతీతంగా వచ్చి ప్రార్థనలు చేసి కొవ్వొత్తులను వెలిగిస్తారు. వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆలయ సముదాయ కమిటీ, మసీదు కమిటీ ప్రతినిధులు కూడా వస్తారు. యానాం పరిసరాల్లోని పలు చర్చిల్లో క్రిస్మస్ వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

24 DEC 2020

### పార్టీ బలోపేతానికి
# సమిష్టిగా కృషి చేయాలి



యానాం (ఇండస్ విజన్ న్యూస్) : యానాం నియోజకవర్గంలో నమూదరాజ్యం కాంగ్రెస్ పార్టీ (ఎన్ఆర్ ) బలోపేతానికి నాయకులు, కార్యకర్తలంత సమిష్టిగా కృషి చేయాలని యానాం ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్ అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో అయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీమంతుల శ్రీధర్, నల్ల వెంకన్న, దుగ్గదూర్తి శ్రీహరి, సుధా భూషణం, చింతలపూడి సత్యనారాయణ, తీరుకోటి నాగేశ్వర రావు, గుత్రపు ప్రహాల్లదుడు, కొరుకోండ రాజేంద్ర ప్రసాద్, మల్లాడి రాజు, మచ్చా శ్రీను, నీలం శ్రీను, పాలెపు సుబ్బరావు, పెసింగి శివ తదితరులు పాల్గొన్నారు.

24 DEC 2020 SAKSHI

# ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని వినతి

యానాం: యానాం బైపాస్ రహదారి చెంతనున్న శ్మశాన వాటికను పలువురు ఆక్రమించుకోవడం పై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక భీమ్‌నగర్ గ్రామస్థులు, యువజన సంఘాల సభ్యులు బుధవారం ఇన్‌చార్జి పరిపాలనాధికారి గుజ్జు గౌరీసరోజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ శ్మశానవాటికకు రక్షణ లేకుండా పోవడంతో ఆక్రమణలకు గురవుతున్నాయని, అదేవిధంగా శ్మశానం చెంతనే చేపలమార్కెట్‌ను సైతం పెట్టడంతో చేపల వ్యర్థాలను, కలుషిత నీటిని శ్మశానంలోనికి వదిలివేస్తుండటంతో దుర్వాసన వస్తుందని వినతిపత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. అంతేకాకుండా మంగళవారం అర్ధరాత్రి వేళ గుర్తుతెలియని వ్యక్తులు కిల్లీ బడ్డీని శ్మశాన వాటిక చెంత నిర్మించారని, ఈ విధంగా శ్మశానం చుట్టూ ఆక్రమణలతో మృతదేహాలను పూడ్చడానికి స్థలం సైతం లేకుండా పోయిందని అన్నారు. కార్యక్రమంలో పి.భైరవమూర్తి, ఎం.వీర్రాజు, పి.గంగరాజు, పువ్వల శ్రీనివాస్, ఎల్.ఏడుకొండలు, పి. సత్యనారాయణ, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## సెంట్రల్ పోలీసు క్యాంటీన్ ప్రారంభం

యానాం: పుదుచ్చేరి పరిధిలోని నాలుగు రీజియన్‌లలోని పోలీసులకు ఉపకరించేవిధంగా పుదుచ్చేరిలో ఏర్పాటు చేసి సెంట్రల్ పోలీస్ సబ్సిడరీ క్యాంటీన్‌ను సీఎం నారాయణసామి బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి అశ్విన్‌కుమార్, డీజీపీ బాలాజీ శ్రీవాస్తవ, అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఎం. ఆనందమోహన్, కమాండెంట్ మహేష్‌కుమార్ బర్న్‌వాల్ తదితరులు పాల్గొన్నారు.



యానాంలోని పురాతన రోమన్ కేథలిక్ చర్చి

## యానాంలో..

యానాం: క్రిస్మస్‌ను ఘనంగా నిర్వహించడానికి బుధవారం నియోజకవర్గ పరిధిలోని వివిధ చర్చిలు సర్వాంగసుందరంగా ముస్తాబయ్యాయి. పట్టణ పరిధిలోని ప్రధానమైన ఫ్రెంచికాలం నాటి రోమన్‌కేథలిక్ చర్చి లో క్రిస్మస్ ఆరాధనలకు సిద్ధమైంది. ఇప్పటికే చర్చిని విద్యుత్తు దీపాలతో అందంగా అలంకరించారు. అదేవిధంగా లోకరక్షకుడు పశువుల పాకలో జన్మించిన విధానాన్ని తెలియజేసే విధంగా దానికి సంబంధించి సెట్‌ను ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో బాప్టిస్ట్, రోమన్‌కేథలిక్, పెంథికోస్ట్ తదితరమైన మొత్తం పెద్ద చర్చిలు ఐదు ఉండగా, మిగిలిన చిన్న చర్చిలు 32 వరకు వివిధ గ్రామాల్లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయా చర్చిల్లో గురువారం రాత్రి నుంచే క్రిస్మస్ వేడుకలు నిర్వహించేందుకు క్రైస్తవులు సిద్ధపడుతున్నారు. క్రిస్మస్ సందడి నెలకొనడంతో పట్టణంలో పలు వ్యాపార సంస్థలు జనంతో కిటకిటలాడాయి. పలుచోట్ల క్రిస్మస్ ట్రీలు, స్టార్‌లు ఏర్పాటు చేశారు. స్థానిక న్యూవంశీ స్వీట్‌స్టాల్‌లో క్రిస్మస్ కేకులను ప్రత్యేకంగా తయారుచేశారు.

### పరంపేటలో సెమీ క్రిస్మస్..

యానాం: నియోజవకవర్గ పరిధిలోని పరంపేట గ్రామంలో బుధవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. రోమన్‌కేథలిక్ చర్చి ఫాదర్ మరియదాసు ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించి క్రీస్తు జననం, క్రిస్మస్ ప్రాధాన్యతను వివరించారు. యానాం, పరిసర ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రార్థనలు చేశారు. కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు.

## న్యూ ఇయర్ వేడుకలపై అనిశ్చితి

యానాం: కొత్త సంవత్సర వేడుకలకు పుదుచ్చేరి సీఎం నారాయణసామి అనుమతిచ్చినప్పటికీ ఎల్జీ కిరణ్‌బేడీ మాత్రం వేడుకలు పుదుచ్చేరి బీచ్‌లో నిర్వహించరాదని వాట్సాప్ ద్వారా బుధవారం ఒక ప్రకటన విడుదల చేయడంతో వేడుకల నిర్వహణపై అయోమయం నెలకొంది. ఇప్పటికే వివిధ ప్రభుత్వ కార్యక్రమాలకు, పెర్మనీలకు అనుమతి విషయంలో ప్రభుత్వానికి, రాజ్‌నివాస్‌కు కోల్డ్‌వార్ నడుస్తున్న నేపథ్యంలో కొత్త సంవత్సర వేడుకల నిర్వహణపై అనిశ్చితి నెలకొంది.

## నేడు దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

యానాం: సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గురువారం సామాజిక అధికారిత శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సోషల్ వెల్ఫేర్ అధికారి చింతా రామజోగి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర సామాజిక న్యాయ, సాధికారిత శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు మంజూరు చేసిన వివిధ ఉపకరణాలను స్థానిక బీసీ హాస్టల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు చేతుల మీదుగా అందజేస్తారని తెలిపారు.